సాక్షి
ఒడిశా
మంగళవారం । 14 । జనవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 8,13,450
బంగారం : 350 మిల్లీ గ్రాములు
వెండి : 279 గ్రాముల 750 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



పుష్పాభిషేకం

శ్రీమందిరంలో స్వామికి పుష్పాభిషేకం చేశారు. రకరకాల పుష్పాలు తీసుకువచ్చారు.

- 8లో.



ఉత్సాహంగా షటిల్ పోటీలు

జయపురంలో షటిల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆటగాళ్లు అదరగొట్టారు.

- 8లో.

న్యూస్‌రీల్

ట్రక్కు బోల్తా



బోల్తాపడిన ట్రక్కు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ పరిధి బోయిపరిగుడ సమితి మవులి గ్రామం మందిరం సమీపంలో సోమవారం ఆదివారం రాత్రి కలపతో వెళ్తున్న ట్రక్కు బోల్తాపడింది. లమతాపుట్ ప్రాంతం నుంచి కలప లోడుతో ఆంధ్రప్రదేశ్ వెళ్తున్న ట్రక్కు మవులి గ్రామ సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్షేమమంగా బయట పడ్డాడు. బొయిపరిగుడ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు.

అదుపు తప్పిన కారు

- ఇద్దరు దుర్మరణం



దుర్ఘటన దృశ్యం

భువనేశ్వర్: నగర శివార్లలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. 16వ నంబరు జాతీయ రహదారి జాంలా సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఖుర్దా నుంచి భువనేశ్వర్ వైపు దూసుకు పోతున్న కారు అదుపు తప్పి మీడియన్ అతిక్రమించి ఆవలి వైపుకు తుళ్లి పోయింది. అదే సమయానికి ఆ వైపు నుంచి వస్తున్న బైక్‌ని కారు బలంగా ఢీకొంది. రెండు వాహనాలు ముఖాముఖి ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ రెండు వాహనాల చోదకులు ఘటనా స్థలంలో తుది శ్వాస విడిచారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక పోలీసుల మృత దేహాల్ని స్వాధీనపరచుకుని పంచనామా కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంతో ఘటనా స్థలం పరిసరాల్లో వాహన రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఉభయ దిశల్లో గంటల తరబడి వాహనాల రవాణా స్తంభించి పోయింది.

అక్రమ కలప రవాణా అడ్డగింత



కలప చెక్కలతో పట్టుబడిన వాహనం

జయపురం: అక్రమంగా కలప రవాణా చేస్తున్న ఒక మినీ ట్రక్కును జయపురం అటవీ విభాగ సిబ్బంది పట్టుకున్నారు. వాహనంలో 34 కలప పట్టాలు ఉన్నాయని వాటి విలువ రూ.1 లక్షకు పైగా ఉంటుందని జయపురం సెక్షన్ ఫారెస్టర్ సునీల్ కుమార్ మహింతి సోమవారం వెల్లడించారు .ఈ సందర్భంగా ఒక యువకుడిని అరెస్టు చేశామని, అతను పంపుణీ గ్రామం కై లాశ బెహర అని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా బెయిల్ మంజూరు కాక పోవటం వల్ల జైలుకు తరలించామని తెలిపారు. డ్రైవర్ పరారయ్యాడని తెలిపారు.

తెలుగు లోగిళ్లలో.. పండగ సందడి

- ఘనంగా భోగి వేడుకలు
- పలుచోట్ల ముందస్తు సంక్రాంతి సంబరాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



రాయగడ: రైతు వేషాధారణలో చిన్నారి

ఒడిశాలోని తెలుగు లోగిళ్లలో సంక్రాంతి కాంతులు కనిపించాయి. భోగి సందర్భంగా తెలుగు వారు ఉంటున్న ప్రతి చోటా భోగి మంటలు వేసుకున్నారు. నృత్యాలు చేసి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని సందడి చేశారు. మహిళలు తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించి పండగకు వన్నె తీసుకువచ్చారు. చిన్నారులు కూడా పంచె కట్టుతో ప్రత్యేకంగా కనిపించారు.



రాయగడ: బసవన్న రూపాలతో..



రాయగడ: విద్యార్థులకు భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు



రాయగడ: కాపువీధి ఉత్సవాల్లో రాధాకృష్ణుల విగ్రహాలు



కొరాపుట్: నారాయణ పట్నలో పండగ వేదికపై ప్రజాప్రతినిధులు, వైశ్య సంఘం పెద్దలు



కొరాపుట్: నారాయణపట్నలో తెలుగు మహిళల కోలాట ప్రదర్శన



కొరాపుట్: నారాయణపట్నలో సాంస్కృతిక ప్రదర్శన



కొరాపుట్: భోగి వేడుకలకు హాజరైన స్థానికులు



భువనేశ్వర్: ఆంధ్ర సంస్కృతి సమితి ఆవరణలో భోగి మంట



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో భోగి మంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



కొరాపుట్: నారాయణపట్నలో భోగి మంటలు వెలిగిస్తున్న తెలుగు ప్రజలు

కొరాపుట్/పర్లాకిమిడి/రాయగడ/భువనేశ్వర్: ఒడిశాలోని తెలుగు లోగిళ్లు పండగ కళను సంతరించుకున్నాయి. సోమవారం భోగి పండగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితి కేంద్రంలోకళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో భోగి మంటలు వెలిగించారు. మహిళలు కోలాటం ప్రదర్శనతో అలరించారు. కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక, మాజీ ఎంపీ జిన్ను హిక్కా, మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసి వేడుకలకు హాజరయ్యారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తెలుగు ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలలో కలియ తిరుగుతూ భోగి మంటలు వెలిగించారు.

పర్లాకిమిడిలో..

పట్టణంలో పలు వార్డుల్లో భోగిపండుగను ఘనంగా జరుపుకున్నారు. తెలుగింటి ఆవరణలు ముచ్చటైన ముగ్గులతో ఆకట్టుకున్నాయి. గుసాని, కాశీనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, పల్లెవాసులతో పర్లాకిమిడి మార్కెట్ కిటకిటలాడింది.

రాయగడలో..

రాయగడ పట్టణంలో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాపువీధిలో యువత ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా ఒక చిన్నారి రైతు వేషధారణ అందరిని ఆకట్టుకుంది. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణతో అలరించారు. అనంతరం భోగి మంటలు వేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సెయింట్ జావియర్స్ పాఠశాలలో భోగి వేడుకలను ప్రిన్సిపాల్ ఎ.రమేష్ పట్నాయక్ ప్రారంభించారు.

ఊరూరా భోగి సందడి

జయపురం: జయపురంలోని తెలుగువారి లోగిళ్లలో సంక్రాంతి సందడి నెలకుంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి భోగి మంటలు నింగికెగిశాయి. యువకులు ఉత్సాహంతో భోగి సంబరాలలో పాల్గొన్నారు. జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాత్ బాహిణీపతి అర్ధరాత్రి భోగి మంట కోసం సిద్ధం చేసిన కలపకు పూజలు చేసి నిప్పు అంటించి పండుగకు శ్రీకారం చుట్టారు. తెలుగు వారు అత్యధికంగా నివసించే వీధులలో యువత పోటీపడి మంటలను వేశారు. కొన్ని ప్రాంతాలలో యువత డప్పులు వాయిస్తూ.. నాట్యాలు చేస్తూ ఉత్సవంలో పాల్గొన్నారు. చిన్నారులు, పెద్దలు అనే తారతమ్యం లేకుండా భోగి మంటల వద్దకు చేరి ఉత్సాహంగా గడిపారు. పిల్లలు భోగి పిడకల దండలు మంటల్లో వేసి ఆనందం వ్యక్తం చేశారు.



పర్లాకిమిడి: రాంనగర్‌లో భోగిపండగను ఆస్వాదిస్తున్న తెలుగు ప్రజలు



జయపురం:మెయిన్ రోడ్డులో భోగి మంట వద్ద కేరింతలు కొడుతున్న యువత



జయపురం: జైలు రోడ్డు డెప్పిగుడలో భోగి మంట



రాయగడ: కాపువీధిలో సంక్రాంతి సంబరాలు



పర్లాకిమిడి: నగరంపల్లివీధిలో భోగి పండుగ



పర్లాకిమిడి: కోమటివీధిలో భోగిమంట వద్ద అర్లి గ్రామ సవర్ల నృత్యం



పర్లాకిమిడి: రాంనగర్‌లో భోగిపండగ



రాయగడ: భోగి మంట వెలిగిస్తున్న రమేష్ పట్నాయక్




రాయగడ: యువతుల డ్యాన్సులు



రాయగడ: సెంట్‌జావియర్స్ పాఠశాలలో భోగి సందడి

రాజరాజేశ్వరునిగా జగన్నాథుడు



శ్రీ మందిరం శిఖరాన సున్నం వేస్తున్న చున్నార్ సేవకులు



బలభద్ర స్వామి బంగారు శోభ



దేవీ సుభద్ర సువర్ణ సౌందర్యం



రాజరాజేశ్వరుని స్వర్ణ అలంకారంలో జగన్నాథ స్వామి

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై జగన్నాథుడు రాజరాజేశ్వరునిగా ధగధగలాడుతున్నాడు. మకర సంక్రాంతి ముందు రోజున మూల విరాటులు స్వర్ణ అలంకరణతో భక్తులకు దర్శనం ఇవ్వడం ఆనవాయితీ. పవిత్ర పుష్య పూర్ణిమ సందర్భంగా శ్రీ మందిరంలో ప్రత్యేక సేవాదులు నిర్వహించారు. బలభద్రుడు, దేవీ సుభద్ర, జగన్నాథ స్వామి మూల విరాటుల్ని స్వర్ణాభరణాలతో అలంకరించారు. 108 కలశాలతో చందన సుగంధిత జలంతో మూల విరాటుల్ని అభిషేకించిన తర్వాత బంగారు ఆభరణాలతో అలకరించారు. శిరసున కిరీటం, పాదాలకు శ్రీపాయర్, చేతికి శ్రీభుజం ఉన్న హరిదామల్, బహుద మాల, సేవతి మాల, చంద్ర సూర్యులు తదితర వివిధ రకాల బంగారు ఆభరణాలతో రాజరాజేశ్వరుని ఠీవిలో శోభిల్లాడు. జగతి నాథుని ఆజ్ఞ మాల పొందిన తర్వాత శ్రీ మందిరం సముదాయంలో మహాలక్ష్మి ఆలయానికి శ్రీదేవి పల్లకిలో చేరింది. ఈ ప్రాంగణంలో శుద్ధి అనంతరం శ్రీదేవి అలంకరణ పూర్తి చేశారు. 14 ఏళ్ల అరణ్యవాసం ముగించుకుని రామచంద్ర స్వామి అయోధ్యకు తిరిగి వచ్చి సింహాసనాన్ని అధిష్ఠించిన ఆనందోత్సాహ వేడుకకు ప్రతీకగా రాజరాజేశ్వరుని అలంకరణలో శోభిల్లుతాడు. ఈ అలంకరణలో స్వామి దర్శనం కోటి జన్మల పుణ్య ఫలమని భక్తుల నమ్మకం. శ్రీ మందిరంలో నిర్వహించే ప్రధాన ఉత్సవాల్లో మకర సంక్రాంతి ఒకటి. ఈ సందర్భంగా దేవాలయం ప్రత్యేకంగా ముస్తాబవుతుంది. సోమవారం శ్రీ మందిరం శిఖరంకి చున్నార్ వర్గం సేవకులు వెళ్లి శిఖరానికి సున్నం వేశారు.

గాజు పొడి పూత దారం నిషేధం



గాలిపటం



అమరేంద్ర పండా, అదనపు డీసీపీ

భువనేశ్వర్: మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా గాలిపటాలు ప్రత్యేక ఉనికిని సంతరించుకున్నాయి. కటక్ మహా నగరం ప్రాంతంలో ఈ సంప్రదాయం అధిక ప్రాచుర్యంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆకాశ వీధుల్లో గాలిపటాల పోటీ జోరుగా సాగుతోంది. ఆకాశ వీధుల్లో ఎగిరే ప్రత్యర్థి గాలిపటం తెగకోసేందుకు పదునైన దారం వాడకంపై ఆసక్తి కనబరుస్తారు. ఈ నేపథ్యంలో గాజు పొడి పూత దారం వాడతారు. దీన్ని చైనీస్ మాంజాగా పిలుస్తారు. ఈ దారం పీకలు తెగ్గొట్టి ప్రాణాంతకమైన ప్రమాదకర పరిస్థితులు తీసుకు వస్తుంది. దీంతో చైనీస్ మాంజా దారం వినియోగంపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ నిషేధ ఉత్తర్వులు వాస్తవ కార్యాచరణ గాలిలో దీపంలా పరిణమించడంతో ప్రాణాంతక పరిస్థితులు భయాందోళనలు కలిగిస్తున్నాయి. మరో వైపు కటక్ నగరంలో చైనీస్ మాంజా దారం బహిరంగంగా విక్రయిస్తున్నారు. సాధారణంగా మహా నది తీర ప్రాంతాల్లో గాలిపటాలు తెగి పడుతుంటాయి. ఈ మార్గంలో రాకపోకలు చేసే వారు ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు ఈ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. గాలిలో ఎగిరే గాలిపటం తెగడంతో పరిసర మార్గాల గుండా వెళ్తున్న వారి పీకకు చుట్టుకుని గొంతు కోసుకుపోయి మృతి చెందిన కేసులు నమోదవుతున్నాయి. తాజాగా సోమవారం కటక్ నగరం లింకు రోడ్ ప్రాంతంలో గాలిపటం దారంతో ఒకరి గొంతు తెగింది. ఈ విచారకర సంఘటనతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఉలికిపాటుకు గురైంది. హై కోర్టు 2016 సంవత్సరంలో జారీ చేసిన నిషేధ ఉత్తర్వుల్ని కఠినంగా అమలు చేసేందుకు నగర కమిషనరేటు పోలీసులు నడుం బిగించారు. చైనీస్ మాంజా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కటక్ అదనపు డీసీపీ అమరేంద్ర పండా హెచ్చరించారు. ఈ మేరకు నగర కమిషనరేటు పరిధిలో అన్ని ఠాణాల్లో పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సీజనులో ఇటీవల 7 రోజుల్లో 3 మంది గాలిపటం చైనీస్ మాంజా దారంతో గాయపడి ఆస్పత్రి పాలైనట్లు సమాచారం.

క్లుప్తంగా

ముగిసిన శ్రీమహావిష్ణువు పూజలు


శ్రీమహావిష్ణువుకు పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని క్షేత్రపాలకుడు శ్రీమహావిష్ణువు ధనుర్మాసం ముగిసిన నేపథ్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసీ దళపూజ, అభిషేకాలు, అర్చనలు, సహస్రనామ పారాయణాలు నిర్వహించి హారతులు ఇచ్చారు. నెల రోజులు పాటు నిర్వహించిన ఈ పూజలు భోగితో సమాప్తం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. పండగ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తి దంపతులకు దీవిస్తోన్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని సోమవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి అర్చకులు గోలెం చరిత్ర, స్వామివారి కథ వివరించి తీర్ధ ప్రసాదాలు అందించి పుణ్య హావచనాలతో దీవించారు.

డెంటల్ విద్యార్థిని అదృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలసలో గల శ్రీసాయి డెంటల్ కళాశాలకు చెందిన విద్యార్థిని ప్రగడ తులసి జ్యోతిర్మయి సంక్రాంతి సెలవులకు వెళ్తూ ఇంటికి రాలేదని విద్యార్థిని తండ్రి ప్రగడ రాజు సోమవారం శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమె బీడీఎస్ తృతీయ సంవత్సరం చదువుతోంది. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని సనపతి వీధి ఆమె స్వస్థలం. ఈ నెల 11న కళాశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంటికి వెళ్తానని చెప్పి బయలు దేరినట్లు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు కృష్ణారావు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం మేజ ర్ పంచాయతీ ఉప్పరవీధికి చెందిన రవ్వ కృష్ణారావు (57) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు ఆదివారం పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకు ని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. గ్రామస్తులు గమనించి స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు పోలీసులు చెప్పారు. కేసులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

132 క్వార్టర్ బాటిళ్లతో వ్యక్తి అరెస్టు


పట్టుబడిన 132 క్వార్టర్ బాటిళ్లు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీ రోడ్డులో 132 క్వార్టర్‌లను ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న వ్యక్తిని కాశీబుగ్గ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం అతని వద్ద ద్విచక్రవాహనాన్ని, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఉదయపురానికి చెందిన పాండవ వెంకటరమణ పలాస నుంచి ఉదయపురం తరలిస్తుండగా జరిపిన తనిఖీల్లో పట్టుబడగా కేసు నమోదు చేశా మని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

కోడి పందేలపై కేసు నమోదు

జలుమూరు: మండల పరిధి అంధవరంతో పాటు గంగన్నపేట-మాకివలస, పర్లాం తోటలో కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నరసన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు సోమవా రం తెలిపారు. వీరి వద్ద నుంచి మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విడిచిపెట్టాలని పోలీసులపై ఒత్తిళ్లు రావడం గమనార్హం.

శ్రీ మందిరంలో పుష్పాభిషేకం జాతరో జాతర


పుష్పాభిషేకం సన్నాహాలు

భువనేశ్వర్: పవిత్ర పుష్య పూర్ణిమ తిథి పురస్కరించుకుని శ్రీ జగన్నాథుడు కొలువు దీరిన శ్రీ మందిరంలో పుష్పాభిషేకం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. పుష్పాభిషేక పూర్ణిమ, దేవాభిషేక పూర్ణిమగా ప్రతీతి. ఏటా మకర సంక్రాంతి సందర్భంగా ముందు రోజున ఆచారంలో భాగంగా సోమవారం ఈ అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నవాంక అలంకరణ చేయడం ప్రత్యేకత. ఈ అలంకరణలో మూల విరాట్లు పూలతో గుబాళించారు. మూల విరాట్లను పూల కిరీటాలు, మాలలతో అలంకరించారు. శ్రీ మందిరం మాలీ సేవకులు ముఖాలకు తుండు చుట్టుకుని దేవుళ్లకు అలంకరించాల్సిన పూల పాత్రతో శ్రీ మందిరం ప్రధాన ప్రాంగణం ఒక మారు ప్రాకార ప్రదక్షిణ నిర్వహించి గర్భాలయానికి చేరదీస్తారు. ఖుంటియా సేవకులు సంధ్యా హారతి సమాయంలో వీటిని అలంకరిస్తారు.


నవాంక అలంకరణకు సిద్ధమైన పుష్ప మకుటాలు


మూల విరాట్ల పూల కిరీటాలు


తులసీ దళం సేకరణ


సంప్రదాయ వేషంలో ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: కొరాపుటియ కళాకారుల బృందం సోమవారం సాయంత్రం 8 దినాల పుష్పుణి మహోత్సవాలను ప్రారంభించింది. స్థానిక బంక మఠం నుంచి సాంస్కృతిక పౌరాణిక, ఆదివాసీ, జానపద, సంప్రదాయ వేషాలతో వందలాది మంది కళాకారులు ర్యాలీగా బయల్దేరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విశాల క్రీడా మైదానానికి చేరుకున్నారు. ర్యాలీలో ముఖ్య ఆకర్షణగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సంప్రదాయ వేషధారణలో హాజరయ్యారు. పుష్పుణి మహోత్సవ కమిటీ కార్యదర్శి ప్రముఖ కళాకారుడు ధిరెన్ మోహన్ పట్నాయిక్ పర్యవేక్షణలో నిర్వహించిన ర్యాలీ పట్టణ ప్రజలను అమితంగా ఆకట్టుకుంది.


ఆదివాసీ నృత్యకారులు


వివిధ వేషాలలో మహిళా కళాకారులు


ర్యాలీలో చిన్నారుల సందడి

రాష్ట్రంలో ఏబీ - పీఎంజేఏవైపై ఒప్పంద పత్రాలపై సంతకాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై) పథకం అమలుకు మార్గం సుగమం అయింది. ఈ మేరకు భారత ఆరోగ్య శాఖ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో సోమవారం ఇరు వర్గాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయడంతో తొలి దశ ప్రక్రియ పూర్తి అయింది. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒడిశా మరో ముందడుగు వేస్తోంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్, ఉప ముఖ్య మంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్, కేంద్ర మంత్రులు జుయెల్ ఓరమ్, అశ్విన్ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ సమక్షంలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

త్వరలో రాష్ట్రంలో ఈ పథకం అమలులోకి వస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పంచాయతీలో ఆయుష్మాన్ భారత్ ఆలయం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆలయంలో యోగా గురువు ఉంటారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులతో ఇతర సౌకర్య అవకాశాలను అందుబాటులో ఉంచుతారు.

ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని దాదాపు 3.5 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతారని ఆరోగ్య శాఖ మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్ తెలిపారు. ఎన్నికల హామీల వాస్తవ కార్యాచరణలో భాగంగా ఈ పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకం గోపబంధు జన ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన ప్రయోజనాలు ఒకే కార్డ్‌లో అందుబాటులో ఉంటాయని మంత్రి ప్రకటించారు. దేశ వ్యాప్తంగా ఎక్కడైన లబ్ధిదారులకు ఏబీ-పీఎంఏవై సేవలు లభ్యం అవుతాయన్నారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 30,000 ఆస్పత్రులు ప్రయోజనకర సేవలు కల్పిస్తాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అంచెలంచెలుగా అమలు చేసి ఏప్రిల్ నాటికి పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకువస్తుంది. 70 ఏళ్ల పైబడిన వారిని ఆయుష్మాన్ యోజనలో చేర్చి సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్యం అందజేస్తారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన ఇక నుంచి గోపబంధు జన ఆరోగ్య యోజనగా చలామణి అవుతుందని ఆరోగ్య శాఖ మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజనను స్వీకరించిన 34వ రాష్ట్రంగా ఒడిశా స్థానం సాధించిందన్నారు.


ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర ఆరోగ్య మంత్రి జె. పి. నడ్డా సమక్షంలో ఏబీ - పీఎంజేఏవైపై ఒప్పందం

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

జయపురం: జయపురం యువత క్రీడలలో ఉత్సాహంగా పాల్గొంటూ ప్రతిభను చాటుతున్నారు. సంబాద్ గ్రూపు ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ 3.0 పోటీలు స్థానిక ఆదర్శనగర్‌లోని డీపీ అకాడమీ ప్రాంతంలో ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఒలింపిక్ క్రీడా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనూప్ కుమార్ పాత్రో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలపై జయపురం యువతకు మంచి ఆసక్తి ఉందన్నారు. వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే క్రీడా రంగంలో కొరాపుట్ జిల్లాను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. సంబాద్ జయపురం ఎడిషన్ చీఫ్ నవీణ చంద్ర సాహు, డీపీ అకాడమీ ప్రతినిధి ఎస్.మునీర్, దేవ దాస్, సుభ్రత్ పండా, ఎం.బాలాజీరావు పాల్గొన్నారు. రెండురోజులు జరగనున్న పోటీల్లో 51 జట్లు తలపడుతున్నాయి. వాటిలో జంబల్ గ్రూపులో 12, సీనియర్ పురుష యుగల్ గ్రూపులు 31, కార్పొరేట్ గ్రూపులో ఎనిమిది జట్లు ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజున 35 మ్యాచ్‌లు జరిగాయి. జంబల్ గ్రూపుకు సభ్యులు ఎస్.మునీర్, అశిత్ పట్నాయక్, కె.ప్రధాన్, జి.ప్రసాద్, ఆర్.తేజ, సిద్ధార్థ నాయిక్, తిరుపతి పాణిగ్రాహిలు విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. అలాగే సీనియర్ పురుషుల యుగల్ గ్రూపులో సాయి చక్రధర్, సౌమ్య పాఢీ, ఆదిత్ రాజ, ఆయుష్ త్రిపాఠీ, సిద్ధార్థన్ నాయిక్, డి.మణికంఠ, ఎస్.మునీర్ అమితాంశు సాహులు సెమీఫైనల్‌కు చేరారు. రిఫరీగా ఆశిత్ పట్నాయక్, అంపైర్‌గా సుజిత్ బొడొనాయిక్ వ్యవహరించారు. సంబాద్ మార్కెటింగ్ అధికారి ఎస్.రవిశంకర్ పోటీలను పర్యవేక్షించారు. పోటీలను తిలకించేందుకు వందలాదిమంది యువ క్రీడాకారులు ఆసక్తి చూపారు.


క్రీడాకారులను అభినందిస్తున్న అతిథులు


తలపడుతున్న సీనియర్ టీం సభ్యులు

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం


రాయగడ: సారె తీసుకువెళుతున్న భక్తులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్ కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో సోమవారం గోదాదేవీ, రంగనాథుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యులు, బృందావనం సూర్యనారాయణ ఆచార్యులు ఈ కల్యాణ మహోత్సవ ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవికి 116 రకాల మిఠాయిలు, పసుపు, కుంకుమ, చీర సారెలను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .

పర్లాకిమిడి: స్థానిక వేంకటేశ్వర స్వామి దేవాలయ కల్యాణ మండపంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు భద్రం శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భద్రం చక్రధర్, కొంచాడ ప్రవీణ్, సప్తగిరి, లక్కోజు వైకుంఠం, బచ్చు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


రాయగడ: గోదా, రంగనాయకుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


పర్లాకిమిడి: గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

8న శాలిహుండం గిరి యాత్ర


శాలిహుండం యాత్ర బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

గార: శాలిహుండం కొండపైనున్న కాళీయమర్ధన వేణుగోపాలస్వామి యాత్ర వచ్చేనెల 8న భీష్మ ఏకాదశి పర్వదినాన జరుగుతుంది. ఈ సందర్భంగా యాత్ర బ్రోచర్ ను సోమవారం ఉదయం ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ విడుదల చేశారు. ఆయన మాట్లా డుతూ ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభమైన ఈ ఉత్సవాలను 12వ తేదీ కల్యాణోత్సవంతో ముగిస్తామన్నారు. ఆలయ అభివృద్ధి కోసం నివేదిక తయారుచేసి, తిరుమల తిరుపతి దేవస్థానాల నిధులతో ఆలయ అభివృద్ధికి చర్యలు కృషి చేస్తామన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో మృతి చెందిన అప్పారావు

టెక్కలి రూరల్: పండగ పూట ఓ కుటుంబంలో విషాదం అలముకుంది. రెండు రోజుల కిందట విశాఖ పట్నం నుంచి తన సొంత గ్రామమైన పెద్ద సాన గ్రామం వచ్చి తన కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపి తిరిగి తన భార్య, పిల్లలు దగ్గరకు వెళ్తుండగా మృత్యువు ఓ బస్సు రూపంలో వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పెద్ద సాన గ్రామం హరిజన వీధికి చెందిన గందావు అప్పారావు(54) అనే వ్యక్తి గత కొంత కాలంగా విశాఖపట్నంలో భార్య గీత, కుమారుడు శివసాయితో కలసి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతి పండుగ సందర్భంగా అప్పారావు తన సొంత గ్రామానికి వచ్చి భోగి రాత్రి మళ్లీ వెళ్లిపోతాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల కిందట విశాఖపట్నం నుంచి పెద్దసాన వచ్చి తిరిగి సోమవారం రాత్రి విశాఖపట్నం వెళ్లేందుకు కె.కొత్తూరు సమీపంలో జాతీయ రహదారి మధ్యలో గల డివైడర్‌ను దాటుతుండగా.. భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో అప్పారావు తలకు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ విజయ్‌కుమార్ వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆత్మహత్య


ఫ్యాన్‌కు వేలాడుతున్న సుధీర్ మృతదేహం

రాయగడ: ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బిసంకటకటక్ సమితి గుతిగుడలో సోమవారం చోటుచేసుకుంది. మృతుడు నియమగిరి ప్రాంతంలోని కుర్లి గ్రామానికి చెందిన మోహన్ కొరకొరియా కుమారుడు సుధీర్ కొరొకొరియాగా గుర్తించారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. తరగతులు ముగిసిన తర్వాత తోటి విద్యార్థులు గదికి వెళ్లే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ సుధీర్ కనిపించడంతో వెంటనే వార్డెన్‌కు తెలియజేశారు. సమాచారం అందుకున్న ఎస్‌డీపీఓ సంతోషిని ఒరం, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

20 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు


శ్యామ్ ప్రసాద్, కలెక్టర్

పార్వతీపురం: కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగిరంగు మచ్చలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరములు, కాళ్ల, చేతుల కండరాల్లో బలహీనత ఉన్నా, తిమ్మిర్లు లక్షణాలున్నా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే ఆరు నెలల్లో పూర్తిగా నయం చేయవచ్చన్నారు. సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

బీఆర్ఏయూ క్రికెట్ జట్టుకు జీసీఎస్ఆర్ విద్యార్థులు


బీఆర్ఏయూ క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

రాజాం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ జట్టుకు స్థానిక జీసీఎస్ఆర్ విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ చీకటి కేశవనారాయణ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న శివాని ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో కళాశాలకు చెందిన కె.రాజేష్‌కుమార్, కె.సాయిభాస్కర్ చక్కని ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 16 నుంచి 25 వరకు చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో బీఆర్ఏయూ జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రవీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో- బైక్ ఢీ

- నలుగురికి గాయాలు

గంట్యాడ: ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. సోమవారం జరిగిన ప్రమాద వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ఆర్.వాసు బైక్‌పై విజయనగరం వెళ్తున్నాడు. సరిగ్గా కరకవలస పెట్రోల్ బంక్ దగ్గరకు వచ్చేసరికి విజయనగరం నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో వాసు కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అలాగే ఆటోలో ఉన్న పెదవేమలి గ్రామానికి చెందిన కొయ్యాన రమణకు చేయి విరిగిపోగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు రమణ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీ కొనడంతో ఒకరికి..


గజపతినగరం : ప్రమాదానికి కారణమైన కారు

గజపతినగరం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పాలదారి చెరువు వద్ద కారు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్రవాహనదారుడు గాయాలపాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. దత్తిరాజేరు మండలం గడబవలస గ్రామానికిచెందిన నెలివాడ లోకేష్ అనే వ్యక్తి తన స్వగ్రామం నుంచి స్కూటీపై గజపతినగరం వస్తుండగా.. గజపతినగరం నుంచి మానాపురం వైపు వెళ్తున్న కారు అతడ్ని ఢీ కొట్టింది. దీంతో లోకేష్‌కు తీవ్రగాయాలు కావడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ఏఎస్సై శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వేపాడ: సంక్రాంతి, తీర్థమహోత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని వల్లంపూడి ఎస్ఐ బి. దేవి హెచ్చరించారు. బల్లంకి, బానాది, కృష్ణారాయుడుపేట గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలతో సమావేశ మయ్యారు. సంక్రాంతి పండగతో పాటు పండగ అనంతరం నిర్వహించే తీర్థమహోత్సవాల్లో పేకాట, బల్లాటలు, కోడి పందేలు, అశ్లీల నృత్యాల ప్రదర్శనలు ఏర్పాటు చేసినా, ప్రోత్సహించినా, అలాగే బెల్టు దుకాణాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని, శాంతిభద్రతల పరిరక్షణకు అంతా సహకరిం చాలని కోరారు

మన బాహుబలి

- కలియుగ భీముడిగా పేరుగాంచిన కోడి రామ్మూర్తినాయుడు
- ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతిని చాటిచెప్పిన మల్ల యోధుడు
- నేడు రామ్మూర్తినాయుడు వర్ధంతి


కోడి రామ్మూర్తి నాయుడు చిత్రపటం

కోడి రామ్మూర్తినాయుడు బల ప్రదర్శన ఊహాచిత్రం

వీరఘట్టం తెలగవీధి వద్ద ఏర్పాటు చేసిన కోడి రామ్మూర్తినాయుడి విగ్రహం

వీరఘట్టం: ఇండియన్ హెర్క్యులస్... కలియుగ భీముడు.. మల్లమార్తాండగా ప్రపంచ దేశాలలో భారతదేశ కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పిన బాహుబలి మన కోడి రామ్మూర్తినాయుడు. ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం ఈయన స్వస్థలం. స్థానిక తెలగవీధికి చెందిన కోడి వెంకన్నానాయుడు, అప్పలకొండ దంపతులకు 1883 నవంబర్ 3న రామ్మూర్తినాయుడు జన్మించారు. హీరోలు ఒంటి చేత్తో కారును ఆపడం.. రెండు తాళ్లు కట్టి కారులను లాగడం.. బండరాళ్లను ఛాతీపై పెట్టి సమ్మెటలతో కొట్టించుకోవడం.. వంటి విన్యాసాలను మనం సినిమాల్లో చూస్తుంటాం. కాని ఇటువంటి ప్రదర్శనలెన్నో మన కోడి రామ్మూర్తినాయుడు ఎప్పుడో చేసి చూపించి, పలువురితో శభాష్ అనిపించుకున్నారు. అంతేకాకుండా తన సర్కస్ కంపెనీ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి అంతర్జాతీయ స్థాయిలో ఇండియన్ హెర్క్యులస్‌గా పేరుగాంచారు. అటువంటి మహానుభావుడి మనోడే అన్ని చెప్పుకునేందుకు మన్యం ప్రజలు గర్విస్తున్నారు. 1942 జనవరి 14న ఆయన స్వర్గస్తులయ్యారు. ఈ నేపథ్యంలో రామ్మూర్తినాయుడు జీవిత చరిత్రపై సాక్షి అందిస్తున్న సమగ్ర కథనం....

బహుముఖ ప్రజ్ఞాశీలి....

రామ్మూర్తినాయుడు వ్యాయామ విద్యను బోధిస్తూనే వాయు స్తంభన, జల స్తంభన విద్యను ప్రదర్శించేవారు. ఇలా వ్యాయామం, దేహదారుఢ్యం, యోగా విద్యలపై పట్టు సంపాదించారు. ఇన్ని విద్యలు తెలిసిన రామ్మూర్తి ఇలానే ఉంటే ఆయన చరిత్ర ఇన్ని మలుపులు తిరిగి ఉండేది కాదు. ఆయన తర్వాత కాలంలో విజయనగరంలో ఒక సర్కస్ కంపెనీ స్థాపించారు. ఆ కంపెనీ కోడి రామ్మూర్తినాయుడు పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.

బడికి డుమ్మా..

అప్పటి శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో పుట్టిన రామ్మూర్తినాయుడు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. తల్లిలేని పిల్లాడు కావడంతో రామ్మూర్తిని తండ్రి వెంకన్ననాయుడు ఎంతో గారాబంగా చూసేవారు. ఈ గారాబంతో రామ్మూర్తినాయుడు బాల్యంలో బడికి వెళ్లకుండా డుమ్మా కొడుతూ.. వీరఘట్టంనకు సమీపంలో ఉన్న రాజా చెరువు వద్దకు వెళ్లి వ్యాయం చేస్తుండేవాడు. దీంతో తండ్రి వెంకన్న తప్పనిసరి పరిస్థితుల్లో కొడుకుని చదువు కోసం విజయనగరంలో ఉన్న తన తమ్ముడు నారాయణస్వామి ఇంటికి పంపించారు. విజయనగరంలో కూడా రామ్మూర్తికి చదువు అబ్బలేదు. విద్య కంటే వ్యాయామంపైనే ఎక్కువ ఆసక్తి చూపుతూ పలు మల్లయుద్ధ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాడు. ఇక రామ్మూర్తికి చదువు వంటపట్టదని గ్రహించిన పిన తండ్రి అతడిని మద్రాసు పంపించి వ్యాయామ కళాశాలల్లో చేర్పించారు. తర్వాత వ్యాయామ ఉపాధ్యాయునిగా నాయుడు విజయనగరంలో తను చదివిన కళాశాల్లోనే పీడీగా బాధ్యతలు చేపట్టారు.

యుక్త వయస్సులోనే....

రామ్మూర్తి తన 20 ఏళ్ల యుక్త వయసులోనే గుండెల మీద ఒకటిన్నర టన్ను బరువును మోసి చూపించేవారు. సర్కస్‌లో విచిత్రమైన, ఊహకందని విన్యాసాలు చేసేవారు. ఆయనను ఉక్కు గొలుసులతో బంధించేవారు. ఊపిరితిత్తుల నిండా గాలి పూరించి, ఆ గొలుసులను తెంచేవారు. రెండు కార్లకు గొలుసులు కట్టి, వాటిని తన భుజాలకు తగిలించుకుని కదలకుండా ఆపేవారు. ఏనుగును ఛాతి మీద ఎక్కించి దాదాపు ఐదు నిమిషాలు ఉండేవారు. అందుకే ఆయన సర్కస్‌కు విశేషమైన ఆదరణ ఉండేది. ఆసియాలోని జపాన్, చైనా, బర్మా దేశాల్లో కూడా రామ్మూర్తినాయుడు ప్రదర్శనలు ఇచ్చి భారతదేశ కీర్తిని చాటిచెప్పారు. బర్మాలో ఆయనపై హత్యాయత్నం జరగడంతో విదేశీ ప్రదర్శనలను నిలిపివేసి స్వదేశంలోనే స్థిరపడ్డారు.


రామ్మూర్తినాయుడి వంశీకుల చిత్రపటాలు


వీరఘట్టంలో రామ్మూర్తినాయుడు జన్మించిన గృహం ఇదే

బ్రహ్మచారి....

కండల వీరుడు కోడి రామ్మూర్తినాయుడు నిత్య బ్రహ్మచారి. శాఖాహారి అయిన ఈయన ఆంజనేయస్వామి భక్తుడు. చిన్నతనంలో వీరఘట్టం సమీపంలోని రాజా చెరువు వద్ద వ్యాయామం చేస్తున్న సమయంలో ఓ సాధువు ఆయనను పిలిచి మంత్రోపదేశం చేశాడని సమాచారం. అప్పటి నుంచి రామ్మూర్తికి దైవచింతన కలిగింది.

కోడి బయోపిక్....

కోడి రామ్మూర్తినాయుడి జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ తీసేందుకు కొద్ది రోజుల కిందట కొంతమంది సినిమావాళ్లు వీరఘట్టం గ్రామానికి వచ్చి ఇక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. వారం రోజులు వీరఘట్టంలో ఉండి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సినీ హీరో దుగ్గుబాటి రానా కోడి రామ్మూర్తిగా నటించనున్నారని అప్పటిలో పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయి. తర్వాత ఈ విషయంపై ఎటువంటి ప్రస్తావన రాలేదు.

మహారాణి పైడితల్లి

- అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు
- చిలకలతో ప్రత్యేక అలంకరణ


మహారాణి అలంకరణలో వనంగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారు


ఆలయంలో పూల అలంకరణ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


చదురుగుడి ఆలయం ముందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వినాయక, వేంకటేశ్వరస్వామి విగ్రహాలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారు వనంగుడిలో భోగీ సందర్భంగా మహారాణి అలంకరణలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. అర్చకుడు నేతేటి ప్రశాంత్ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చదురుగుడి, వనంగుడి ఆవరణల్లో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, దూసి శివప్రసాద్ భక్తిశ్రద్ధలతో మహాచండీ యాగం నిర్వహించారు. చదురుగుడిని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించడంతో పాటు పైడితల్లికి చిలకలు నివేదించారు. అలాగే సిటీ బస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కొలువైన భవానీ శంకరస్వామికి అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో అన్నాభిషేకం చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పంచదార చిలకల నైవేద్యంతో పైడితల్లి


విద్యుత్ అలంకరణలో చదురుగుడి


చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు


భవానీశంకరునికి అన్నాభిషేకం

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గంట్యాడ: అగ్ని ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని రామవరం గ్రామానికి చెందిన పూడి గౌరమ్మ(81) ఈనెల 6వ తేదీన ప్రమాదవశాత్తు కుంపటిలో కూర్చొవడంతో గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరిృంచారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం కన్నుమూసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తకోట జంక్షన్ వద్ద 503 మద్యం బాటిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా.. వ్యాన్‌లో తరలిస్తున్న మద్యం సీసాలు పట్టుబడ్డాయన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

ఆ గ్రామాల్లో రెండు రోజుల సంక్రాంతి..


పినతాడివాడ గ్రామం

డెంకాడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండగను రెండు రోజులు నిర్వహిస్తారు. వాస్తవానికి భోగి, సంక్రాంతి, కనుమ పండగలను వరుసగా సోమ, మంగళ, బుధవారాల్లో నిర్వహించాల్సి ఉంది. అయితే ఆయా గ్రామాల్లో మంగళవారం పెద్ద పండుగ పేరుతో కొంతమంది సంక్రాంతి జరుపుకోగా.. మరుచటి రోజు మరికొంతమంది చిన పండుగ పేరుతో సంక్రాంతి జరుపుకోవడం విశేషం. పూర్వం నుంచి ఇదే ఆచారం కొనసాగుతోందని.. చిన పండుగ తర్వాత కనుమ, ముక్కనుమ జరుపుకుంటామని ఆయా గ్రామాల పెద్దలు చెబుతున్నారు. మండలంలోని పినతాడివాడ, పెదతాడివాడ, గుణుపూరుపేట, గుణుపూరు, డెంకాడ, సింగవరం, నాతవలస, డి.కొల్లాం, చొల్లంగిపేట, గొడిపాలెం, వెదుళ్లవలస, తదితర గ్రామాల్లో రెండు రోజుల సంక్రాంతి ఆచారం ఉంది.

ఉద్యోగులకు సన్మానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో ఉద్యోగాలు సాధించిన పలువురిని గురజాడ గ్రామీణ గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సీఆర్‌పీఎఫ్, అగ్నివీర్ వంటి కేంద్ర కొలువులు సాధించిన యువకులతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో డిప్యూటీ జీఎంగా విధులు నిర్వహించి, పదవీ విరమణ చేసిన పతివాడ బలరామ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రేగాన శ్రీనివాసరావు, కడలి ప్రకాశరావు, బోనుమహంతి ఆదినారాయణ, రాంబార్కి రామారావు, బూర్లె సత్యం, గొర్లి శ్రీనివాసరావు, నేతేటి సుగుణాకరరావు, రామారావు, యువత పాల్గొన్నారు.


విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ బలరామ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

యువత క్రీడల్లో రాణించాలి

- జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కొండవెలగాడలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో స్థానిక రెడ్డిక వీధికి చెందిన క్రికెట్ జట్టు విజయాన్ని సాధించింది. 110 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెడ్డికి వీధి జట్టు కేవలం ఎనిమిది ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి టోర్నీలో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో ఇప్పటికే కొండవెలగాడకు సముచిత స్థానం ఉందన్నారు. క్రీడల్లో రాణిస్తూ యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు డ్రోన్స్‌తో పర్యవేక్షణ

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని నేరాల నియంత్రణకు డ్రోన్స్‌తో పర్యవేక్షిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ వకుల్‌జిందల్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రద్దీ ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసేందుకు, నేరాలను నియంత్రించేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టేందుకే డ్రోన్స్ ఉపయోగపడతాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో ఎస్సైలు నరేష్, సురేంద్ర నాయుడు, ప్రసన్నకుమార్, తదితరులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.

● కరెన్సీ సాయి...


విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగురోడ్డు సింహాద్రినగర్‌లో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహంతో పాటు వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహాలను కరెన్సీ నోట్లతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కరణం జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విజేతలకు బహుమతుల పంపిణీ


రంగోలీ పోటీల విజేతలతో వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం టౌన్: వాజీ చానల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రంగోలి పోటీల విజేతలకు సోమవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో బహుమతులు అందజేశారు. ప్రథమ విజేత ఎ. లతకు (హైదరాబాద్) ఎలక్ట్రికల్ స్కూటీ బహూకరించారు. బి. శాంతి (గుంటూరు), ఎం.సువర్ణ (విజయవాడ)ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలందరికీ వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, సురేష్‌బాబు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్వి బహుమతులు అందజేశారు.